క్లుప్తంగా

కంటి వైద్య పరీక్షలు


కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీలత

వాల్మీకిపురం : శ్రీ షిరిడిసాయి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షలకు విశేష స్పందన లభించింది. తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 150 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. వీరిలో 30 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు డాక్టర్ శ్రీలత తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, శ్రీధర్ రాయల్, వైద్య సిబ్బంది గౌరి శంకర్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అధిక రుసుం వసూలు చేస్తే చర్యలు


సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌డీఓ లక్ష్మీపతి

మదనపల్లె : మీ–సేవ కేంద్రాల్లో ప్రభుత్వ నిర్దేశిత ఫీజుల కన్నా అధికంగా వసూలు చేస్తే నిర్వాహకులపై చర్యలు తప్పవని డీఎల్‌డీఓ లక్ష్మీపతి హెచ్చరించారు. గురువారం పట్టణంలోని మీ–సేవ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనివిధానాన్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల జారీ తదితర పనుల్లో అవకతవకలకు తావు లేకుండా చూడాలన్నారు. మీ సేవ సెంటర్లలో సర్వీసు చార్జీల ధరల పట్టిక(సిటిజన్ చార్ట్) ఉండాలన్నారు. అనంతరం మున్సిపాలిటీలోని వార్డు సచివాలయాలను సందర్శించిన ఆయన సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు.

అవినీతి అక్రమాలను బయటికి తీస్తాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి


కలికిరి : గత ప్రభుత్వ హయాంలో మండలంలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలను బయటికి తీస్తామని, అవినీతి పరులను వదిలే ప్రసక్తే లేదని పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ నిధుల దుర్వినియోగం, ఆక్రమణలపై విచారణ జరిపి చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. మండల అభివృద్ధికి అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామక్రిష్ణయ్య, తహసీల్దారు విజయకుమారి, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీకర్‌రెడ్డి, చంద్రకుమార్ రెడ్డి, నాయకులు నిజాముద్దీన్, యోగేష్‌రెడ్డి, సహదేవరెడ్డి, సతీష్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, జనార్ధన్ గౌడ్, క్రిష్ణారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, మాలతి తదితరులు పాల్గొన్నారు.

సినిమా థియేటర్‌ను పరిశీలించిన ఆర్డీఓ


సినిమా థియేటర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ రంగస్వామి

పీలేరు : స్థానిక సీఎస్ఎన్ సినిమా థియేటర్‌ను రాయచోటి ఆర్డీఓ రంగస్వామి పరిశీలించారు. థియేటర్ యాజమాన్యం లైసెన్స్ రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకోవడంతో ఆయన గురువారం థియేటర్‌ను సందర్శించారు. థియేటర్‌లోని సౌకర్యాలు పరిశీలించారు. రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

భోజనం ప్లేట్లు వితరణ


ప్లేట్లను అందజేస్తున్న పూర్ణిమ

మదనపల్లె సిటీ : స్థానిక బీకేపల్లిలోని ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడిచే ఆనంద నిలయానికి మహాకార్య ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు పూర్ణిమ భోజనం ప్లేట్లను అందజేశారు. గురువారం ఆనంద నిలయంకు వెళ్లి వారు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ధాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు స్వాతి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు జీవితం ఆదర్శనీయం


మదనపల్లె సిటీ : అల్లూరి పోస్టర్ వద్ద నివాళులర్పిస్తున్న వీహెచ్‌పీ సభ్యులు


మదనపల్లె : అల్లూరి చిత్రపటం వద్ద పూలు సమర్పిస్తున్న ఆర్డీఓ హరిప్రసాద్


తంబళ్లపల్లె : తహసీల్దార్ కార్యాలయంలో...


వాల్మీకిపురం : గురుకుల పాఠశాలలో...

మదనపల్లె : అల్లూరి సీతారామరాజు తెలుగుజాతి ఆణిముత్యమని ఆర్డీఓ హరిప్రసాద్ అన్నారు. అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని పురస్కరించుకుని గురువారం ఆర్డీఓ, మున్సిపల్, మండల తహసీల్దార్ కార్యాలయాల్లో అల్లూరి చిత్రపటానికి ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, తహసీల్దార్ రమాదేవి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ భారత స్వరాజ్య సంగ్రామ చరిత్రలో తెలుగునాట పోరుబాటన నడచిన మహోజ్వల శక్తి అల్లూరి సీతారామరాజు అన్నారు. గిరిజనుల హక్కుల కోసం బ్రిటీష్ వారితో పోరాడిన మహనీయుడు సీతారామరాజు అని కొనియాడారు. అతి చిన్న వయసులో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని నేటి యువతకు ఆదర్శనీయుడు అయ్యారన్నారు. 1922–24 మధ్య కాలంలో వందేళ్ల క్రితం రంప తిరుగుబాటును ఆయన ముందుకు నడిపిన తీరు ఈ తరం యువతకు ఆదర్శనీయమైనదన్నారు. ఆయన స్ఫూర్తితో గిరిజనుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో డీఏఓ శ్రీనివాసులు, డివిజనల్ సర్వేయర్ లక్ష్మీనారాయణ, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిగా తీసుకోవాలి

మదనపల్లె సిటీ : విద్యార్థులు విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజును స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి అన్నారు. స్థానిక కాలేజీలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య సమరంలో మన్యం ప్రాంతంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా జరిపిన పోరాటాన్ని, విప్లవవీరునిగా పేరు గాంచిన విధానాన్ని విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు ఖాజావల్లి, హజీరాఖానమ్, మోహన్‌బాబు, జ్యోతి, మోహన్‌వల్లి తదితరులు పాల్గొన్నారు. వ్యక్తిత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్థానిక రింగురోడ్డులో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో అల్లూరి సీతరామరాజు 127వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు రామమోహన్, సహాయ కార్యదర్శి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి జయంతి – స్వామి వివేకానంద వర్ధంతి

వాల్మీకిపురం : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి, ఆధ్యాత్మిక వేత్త స్వామి వివేకానంద వర్ధంతిని స్థానిక జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో అల్లూరి సీతారామరాజు, స్వామి వివేకానంద చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యం ప్రజల హక్కుల కోసం బ్రిటీష్‌వారిపై పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేశారన్నారు. భారతీయ ఆధ్యాత్మిక విశిష్టతను, హిందూ ధర్మ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన దార్శనికుడు స్వామి వివేకానంద అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కల్పన, ఉపాధ్యాయులు రామలక్ష్మమ్మ, బేబి ప్రసన్న, వినయ, సత్యమ్మ, రేఖ, గిరిజారాణి, శోభన, శైలజ, సరస్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు జాతి ముద్దుబిడ్డ

పెద్దతిప్పసముద్రం : బ్రిటీష్ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన తెలుగు జాతి ముద్దుబిడ్డ అల్లూరి సీతారామరాజు అని తహసీల్దార్ నరసింహారావ్, డీటీ విద్యాసాగర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది అల్లూరి జయంతి వేడుక సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వరాజ్యం కోసం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని, మహనీయుల త్యాగాలు, పోరాటాలను మరవరాదని ఆర్ఐ అనీషా, వీఆర్వోల సంఘం మండలాధ్యక్షుడు శ్రీరాములు అన్నారు.

ఆయన పోరాటం మరుపురానిది

తంబళ్లపల్లె : స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని తహసీల్దార్ బ్రహ్మయ్య అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బ్రిటీష్ పాలకుల నుంచి భారతీయులకు విముక్తి కల్గించేందుకు ఆయన చేసిన పోరాటం మరపురానిదన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామసముద్రం : రామసముద్రం ఎంపీడీవో కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం ఆయన బ్రిటిష్ వారితో పోరాడిన పోరాటాలను కొనియాడారు. భారత స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన విప్లవ వీరుడన్నారు. మన్యం ప్రజల హక్కుల కోసం సాయుధ పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో భానుప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెంచండి


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ సుజాత

రామసముద్రం : అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల సంఖ్య తగ్గితే సహించేది లేదని, ప్రతి గ్రామంలో తల్లుల సమావేశం ఏర్పాటు చేసి పిల్లల శాతం పెంచాలని ఐసీడీఎస్ సీడీపీవో సుజాత తెలిపారు. గురువారం రామసముద్రం స్త్రీశక్తి భవనంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రతి ఒక్క అంగన్‌వాడీ కేంద్రం తెరిచి ఉంచాలన్నారు. ఆయా, కార్యకర్తలు ఇద్దరు యూనిఫాంలో ఉండాలన్నారు. మెను ప్రకారం పిల్లలకు ఫుడ్ పెట్టి, 9 నుంచి 10 గంటలలోపు కోడిగుడ్డు ఇవ్వాలన్నారు. మధ్యాహ్నం పిల్లలకు భోజనం అందించి, 3 నుంచి 4 గంటలలోపు పాలు వేడి చేసి తాపించాలన్నారు. అదే విధంగా కేంద్రాల్లో నమోదు పుస్తకం ప్రకారం స్టాక్ అన్ని కూడా సక్రమంగా ఉండాలన్నారు. టిహెచ్‌ఆర్ తల్లులకి స్టాక్ వచ్చిన వెంటనే వస్తువులు పంపిణీ చేయాలన్నారు. కేంద్రం పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శాంతమ్మ, చంద్రకాతమ్మ, బిపిసి కళ్యాణి పాల్గొన్నారు.

మిట్స్‌కు ప్రఖ్యాత కళాశాలల జాబితాలో స్థానం


ర్యాంకింగ్ సర్టిఫికెట్‌తో మిట్స్ ప్రతినిధులు

కురబలకోట : మదనపల్లె దగ్గర ఉన్న అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు ప్రపంచ స్థాయిలో ప్రఖ్యాత కళాశాలల జాబితాలో స్థానం లభించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ గురువారం తెలిపారు. ఎస్‌సీఐ మాగో ఇన్‌స్టిట్యూషన్స్ ర్యాంకింగ్‌లలో ఈ ఘనత సాధించినట్లు ఆయన తెలిపారు. ప్రపంచ స్థాయిలో నాణ్యమైన జర్నల్స్, పేటెంట్లు ఆధారంగా 2024 సంవత్సరానికి విద్య, పరిశోధన సంస్థలకు ర్యాంకింగ్‌లు ప్రకటించిందన్నారు. రీసెర్చ్ ల్యాబ్‌లు, ఐఐటీలు, ఎన్ఐటీలతో సహా ప్రఖ్యాత ఇన్‌స్టిట్యూట్‌ల జాబితాలో మిట్స్ కళాశాలకు స్థానం లభించిందన్నారు. ప్రపంచ స్థాయిలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో 1165, ఇంజినీరింగ్‌లో 3688, గణితంలో 1880, ఫిజిక్స్, ఆస్ట్రానమిలో 2160 స్థానం లభించిందన్నారు. రాష్ట్రంలో ఆరు కళాశాలలు ఉండగా అందులో మిట్స్ కళాశాల ఒకటని తెలిపారు. ఇందుకు కారకులైన వారిని మిట్స్ కళాశాల కరస్పాండెంట్ ఎస్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదేళ్ల అభినందించారు.

అతిసారపై అప్రమత్తంగా ఉండాలి


ఓఆర్ఎస్ ద్రావణంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అనుపమ

తంబళ్లపల్లె : వర్షా కాలంలో తాగునీటి కలుషితం వల్ల ప్రబలే అతిసార (డయేరియా) వ్యాధి పట్ల ప్రజలు ముందస్తు జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని కోసువారిపల్లె పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనుపమ తెలిపారు. గురువారం 12 హెల్త్ క్లినిక్‌ల పరిధిలో అతిసారపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అతిసార బారిన పడినవారు ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలన్నారు. నీటితో చక్కెర, ఉప్పు కలిపి ఓఆర్ఎస్ ద్రావణం తయారు చేసుకునే తీరును ప్రజలకు వివరించారు. అతిసార బారిన పడిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలు పొందాలన్నారు. క్షయ వ్యాధి నివారణకు ముందస్తుగా బీసీజీ వ్యాక్సిన్ టీకాలు వేసుకోవాలన్నారు. 156 మందికి బీసీజీ వ్యాక్సిన్ ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 3,824 మందికి బీసీజీ వ్యాక్సిన్ వేశామని, భవిష్యత్తులో క్షయవ్యాధిని పూర్తిగా అరికట్టేందుకు ప్రజలు సహరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం


మదనపల్లె సిటీ: జెడ్పీ పాఠశాల వద్ద విద్యార్థి సంఘం నాయకుల నిరసన


పీలేరు రూరల్ : నినాదాలు చేస్తున్న ఎస్ఎస్‌యూఐ నాయకులు, విద్యార్థులు

మదనపల్లె సిటీ : ఐక్య విద్యార్థి సంఘాల పిలుపు మేరకు మదనపల్లెలో గురువారం విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, విద్యార్థి సంఘాలు పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల వద్దకు వెళ్లి స్వచ్ఛందంగా మూయించి విద్యార్థులను బయటకు పంపించి వేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులను బయటకు పంపాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి అడ్డుకున్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మాధవ్ మాట్లాడుతూ నీట్ పరీక్ష లీకేజీలో భాగస్వాములైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షలు రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలన్నారు. పాఠశాలల మూతను ఆపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వినయ్, నియోజకవర్గ నాయకులు విష్ణు ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరు రూరల్ : విద్యా సంస్థల బంద్ విజయవంతం అయినట్లు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృతతేజ అన్నారు. గురువారం బంద్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) జాతీయ స్థాయి పరీక్షలు నిర్వహించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. నీట్ పరీక్ష లీకేజీ వెనుక కుంభకోణం, నీట్ పీజీ పరీక్షను 12 గంటల ముందు వాయిదా వేయడం, యూజీసీ నెట్ పరీక్ష రద్దు చేయడం వంటివి విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేద్దాం


మాట్లాడుతున్న ఎంపీపీ కుసుమకుమారి

రామసముద్రం : పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ అధికారుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ కుసుమకుమారి తెలిపారు. గురువారం రామసముద్రం ఎంపీడీవో కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా అధికారులు అభివృద్ధి నివేదికను వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ప్రజలు ఎలాంటి సమస్యలతోను ఇబ్బంది పడకుండా అందరి సమన్వయంతో పరిష్కారాలపై దృష్టి సారించాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు సహకరిస్తూ ఎలాంటి బేధాభిప్రాయాలు, కక్ష్య సాధింపులు లేకుండా అభివృద్ధి బాటలో ముందుకు పోవాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రజల నుంచి వచ్చే అర్జీలను స్వీకరిస్తూ పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రమణారెడ్డి, గంగాధర్‌నాయుడు, ఇన్‌చార్జి ఎంపీడీవో భానుప్రసాద్, డీటీ శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లీలా, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

నిమ్మనపల్లె : మండలంలోని అగ్రహారం పంచాయతీ బండమీదపల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని సూపర్‌వైజర్ భానులక్ష్మీదేవి గురువారం తనిఖీ చేశారు. కేంద్రం వద్ద గర్భవతులు, బాలింతలతో సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్రంలో కొద్దిరోజులుగా కోడిగుడ్లు కుళ్లిపోయినవి సరఫరా చేస్తున్నట్లు ఆమె దృష్టికి తెచ్చారు. కేంద్రాన్ని అంగన్‌వాడీ టీచర్ ఇంటిలో కాకుండా వేరెక్కడైనా ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని గ్రామంలో మరోచోట నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ జావీద్‌బాషా, మహిళాపోలీస్ శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందనలు


బహుమతులు అందజేస్తున్న డీఎం కుమార్

పీలేరు రూరల్ : ఆర్టీసీలో అదర్శ ఉద్యోగులను నగదు బహుమతులతో అభినందించారు. గురువారం స్థానిక డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎం కుమార్ మాట్లాడుతూ 6.23 కేఎంపీఎల్ సాధించి 119 లీటర్ల డీజిల్ పొదుపు చేసిన డ్రైవర్ బి.ఆర్.సి.నాయక్‌కు మొదటి బహుమతి, 5.87 కేఎంపీఎల్ సాధించి 110 లీటర్ల డీజిల్ పొదుపు చేసిన కె.వి.స్వామికి ద్వితీయ బహుమతి అందజేసినట్లు తెలిపారు. అలాగే అధిక ఈపీకే సాధించిన కండెక్టర్లకు నగదు బహుమతి అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక సూపర్‌వైజర్లు, గ్యారేజ్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు


నగదు లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

మదనపల్లె సిటీ : స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి, సోమేశ్వరస్వామి ఆలయాల్లో గురువారం హుండీ ఆదాయం లెక్కించారు. మూడు నెలకు వెంకటరమణస్వామి ఆలయంలో రూ.5,97,582, సోమేశ్వరస్వామి ఆలయంలో రూ.44,780 ఆదాయం వచ్చినట్లు దేవాదాయశాఖ ఈఓ రమణ తెలిపారు. రెండు సంవత్సరాల బంగారు, వెండి లెక్కించారు. బంగారు 5 గ్రాములు, వెండి 161 గ్రాములు వచ్చినట్లు ఈఓ తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ మాజీ చైర్మన్ బింగి పాండు, మాజీ సభ్యులు ప్రసాద్‌రెడ్డి, భాస్కర, సిబ్బంది అంకన్న, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర

రైల్వేకోడూరు అర్బన్ : వీవీ కండ్రిక గ్రామంలో గురువారం ఘనంగా గంగమ్మ జాతర నిర్వహించారు. ఉదయం నుంచే పెద్దఎత్తున భక్తులు ఈ జాతరలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మందల నాగేంద్ర, బుడుగు శివయ్య, ఉత్తరాది శివకుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నీ

నందలూరు : అరవపల్లెలోని జెడ్పీహెచ్ఎస్‌లో క్రికెట్ టోర్నీ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. దివంగత తుంటి యానాదయ్య, సరోజనమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు తుంటి నందా యాదవ్ ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. హార్డ్ టెన్నీస్ బాల్‌తో జరిగే ఈ టోర్నీలో నందలూరు, సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల నుంచి రిజిస్టర్ చేసుకున్న జట్లు పాల్గొననున్నాయని నిర్వాహకుడు పల్లె గ్రీష్మంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన వారికి రూ. 40 వేలు, రన్నర్స్‌కు రూ. 25 వేలు అందజేయనున్నట్టు తెలిపారు.

కలిసికట్టుగా డెంగీని నివారిద్దాం


కేవీపల్లె : దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది


వాల్మీకిపురం : నినాదాలు చేస్తున్న వైద్య సిబ్బంది, గ్రామస్తులు


పీలేరు : చెరువులో గంబుసియ చేపపిల్లలు వదులుతున్న అధికారులు

వాల్మీకిపురం : అందరం కలిసికట్టుగా డెంగీని నివారిద్దామని మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ అన్నారు. గురువారం మండలంలోని గండబోయనపల్లి, మంచూరు తదితర గ్రామాల్లో డెంగీ నివారణపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం వచ్చిందని, వాతావరణ మార్పులను దృష్టిలో పెట్టుకొని ఇళ్లలో దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమ కాటువల్లే డెంగీ వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున మన ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వారంలో ఒక రోజును డ్రైడేగా పాటించాలన్నారు. అనంతరం డెంగీ లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాగిరెడ్డి, వాణి, రాణి, భారతమ్మ, మౌనిక, వనిత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పగటిపూట దోమలతో ప్రాణానికి చేటు

కేవీపల్లె : పగటిపూట దోమలతో ప్రాణానికి చేటని గరిమిట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రేష్మ అన్నారు. మండలంలోని మిన్నంరెడ్డిగారిపల్లెలో డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగీ వ్యాధి వ్యాప్తికి ఏయిడిస్ ఈజిప్టి దోమలు కారణమన్నారు. ఇవి పగటిపూట ఉండి మనుషులను కుడుతాయన్నారు. దోమలు వృద్ధి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్నపిల్లల్లో అతిసార లక్షణాలు, ప్రమాదకర పరిస్థితులు, ఓఆర్ఎస్ ద్రావణ వినియోగం, తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పురుషోత్తం, హెచ్ఎంలు రజియాబేగం, తిమ్మయ్య, ఉపాధ్యాయులు రేణుకాదేవి, నాగరాజ, ఆరోగ్య సిబ్బంది చంద్రమైత్రిసుధ, రహీనబేగం, వెంకటరమణ, ధరణి, రెడ్డిమోహన్, అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ, ఆశలు గాయత్రి, విజయ పాల్గొన్నారు.

దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులు

పీలేరు : దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులని జిల్లా మలేరియా నివారణ అధికారి బి.వేణుగోపాల్ అన్నారు. దోమల నియంత్రణలో భాగంగా గురువారం వేణుగోపాల్ వారి సిబ్బందితో స్థానిక అయ్యప్పనాయునిచెరువులో గంబుసియ చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల లార్వాలను గంబుసియ చేపలు తినడం వల్ల దోమల వృద్ధిని తగ్గించవచ్చునని తెలిపారు. దోమకాటుతో మలేరియా, డెంగీ, చికున్ గున్యా, మెదడువాపు, బోధవ్యాధి వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారులు విద్యాసాగర్, ముజీబ్, హెచ్ఈ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ, ఏఎన్ఎం భార్గవి, లావణ్య, సీహెచ్‌వో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.